సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



హామీలు నమ్మకండి

బీఆర్‌ఎస్ మోస పూరిత హామీలను నమ్మరాదని కర్ణాటక రాష్ట్రం బల్లారి ఎమ్మెల్సీ సతీష్ యోచరెడ్డి సూచించారు. 10లో▸



ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ దొంగతనం చేశారు. 10లో▸



బీమాతో భరోసా

పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు



కేసీఆర్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి గురువారం నగరంలోని ప్రగతి భవన్‌లో కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌ను తనకు కేటాయించడంతో సీఎంను కలిసినట్లు తెలిపారు. భారీ మెజారిటీతో గెలవాలని సీఎం సూచించారని పేర్కొన్నారు.

నేడు కొడంగల్‌కు మంత్రుల రాక

కొడంగల్: పట్టణానికి శుక్రవారం రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బీ ప్రకాశ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. మహేందర్‌రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారి కొడంగల్ వస్తున్నందున ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తనకు రెండోసారి ఎమ్మెల్యే టికెట్ రావడంపై నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం ఉదయం 10 గంటలకు బండల ఎల్లమ్మ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో మంత్రులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి మహేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ తదితరులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

27న ద్వి దశాబ్ది ఉత్సవాలు

అనంతగిరి: వికారాబాద్‌లోని శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్ర ద్వి దశాబ్ది ఉత్సవాలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం అధ్యక్షులు డాక్టర్ హారతి ద్వారకానాథ్, సేవా సమితి కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 8.30 గంటలకు పతాకావిష్కరణ, అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమం, సాయి గాయత్రి యజ్ఞం, పూర్ణాహుతి, 11 గంటలకు ఆధ్యాత్మిక సమావేశం ఉంటుందని తెలిపారు.

మంత్రి ‘పట్నం’కు నేతల అభినందనలు



ధారూరు: రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేసిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి గురువారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.హన్మంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు హఫీజ్, ఇబ్రహీం కలసి అభినందనలు తెలిపారు. మంత్రికి పుష్పంగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ ఇండస్ట్రియల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ డిమాండ్ చేశారు. కొద్ది రోజులుగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 9వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా దత్తు నాయక్ మాట్లాడుతూ.. సెకండ్ ఏఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా రూ.50 లక్షలు ఇవ్వాలని, విధి నిర్వహణలో చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పిన కేసీఆర్ మాట తప్పారని మండిపడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు దేవేందర్‌గౌడ్, ఏఎన్‌ఎంలు పద్మ, సువర్ణ, అరుణ, సునీత, మనెమ్మ, జయమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కలిసొస్తారా..

అసమ్మతి నేతలపై అధికార పార్టీ దృష్టి

- మచ్చిక చేసుకునే పనిలో ఎమ్మెల్యేలు
- ఆకస్మిక ప్రేమపై అనుమానాలు
- కొందరి చూపు కాంగ్రెస్ వైపు
- వేచి చూసే ధోరణిలో మరికొందరు
- ముఖం చాటేసిన మనోహర్‌రెడ్డి



వికారాబాద్: అధికార పార్టీ అసమ్మతి నేతలు దారికొస్తారా అనే దానిపైనే ఇప్పుడు జిల్లాలో ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. సీఎం కేసీఆర్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలను సిట్టింగ్ ఎమ్మెల్యేలకే కేటాయించారు. దీంతో టికెట్ ఆశించిన వారు గుర్రుగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో టికెట్ ఆశించిన నేతలు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు కేటాయించడంతో కొడంగల్‌లో అసమ్మతి వర్గం కాంగ్రెస్ గూటికి చేరింది. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన నేతలు అయోమయానికి గురవుతున్నారు. వీరు తలోదారి ఎంచుకుంటున్నట్లు సమాచారం. అయితే కొందరు పార్టీలోనే ఉంటూ తమ అసంతృప్తిని తెలియజేస్తుండగా, మరికొందరు కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నారు. ఇంకొందరు వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

కాంగ్రెస్‌తో టచ్‌లో పలువురు నేతలు

కొడంగల్‌లో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి దక్కదని తేలడంతో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఆయన అనుచరులతో కలిసి ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరారు. పరిగికి చెందిన పలువురు నేతలు సైతం హస్తం కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. తాండూరుకు చెందిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి కమలం గూటికి వెళ్లారు. ఇక తాండూరుకు చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. పరిగి నియోజకవర్గంలో ఇటీవలి వరకు ఎమ్మెల్యేతో విభేదించిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అతని వర్గంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, మరి కొంత మంది నేతలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వికారాబాద్ నియోజకవర్గంలోనూ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఓ ఎంపీపీ, ఏఎంసీ మాజీ చైర్మన్ తదితరులు కాంగ్రెస్‌తో కలసి నడిచేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అయోమయంలో అనుచర గణం

కొందరు ముఖ్యనేతలు టికెట్లు ఆశించి రాకపోవడంతో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా వర్గాలను పెంచి పోషించిన విషయం తెలిసిందే.. చివరకు అధిష్టానం చేపట్టిన సామ దాన బేధ దండోపాయాలకు తలొగ్గి మిన్నకుండి పోయారు. మరో ముఖ్యనేతకు బీఆర్‌ఎస్ అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో పక్క చూపులు మానేసి పార్టీలోనే కొనసాగేందుకు సిద్ధమయ్యారు. పరిగి నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య నాయకుడు టికెట్ రాదని తేలడంతో అనుచరగణంతో మొహం చాటేశారు. దీంతో ఆయన్ను నమ్ముకుని ఎమ్మెల్యేలతో సున్నం పెట్టుకున్న పలువురు నేతలు తమను నట్టేట ముంచి వెళ్లారని మండి పడుతున్నారు. ఇన్నాళ్లు వెంట తిప్పుకుని కనీసం ఫోన్ కూడా తీయడం లేదని వారు వాపోతున్నారు. ఒకవేళ నేతల బుజ్జగింపులతో తిరిగి ఎమ్మెల్యేల వర్గంలో చేరినా.. భవిష్యత్తు ఓ తమ పరిస్థితి ఏంటని వారు ఆందోళనకు గురవుతున్నారు. త్వరలో ఎన్నికలు ఉన్నాయి కాబట్టే తమను బతిమాలుతున్నారనే అభిప్రాయానికి వచ్చారు. ఎన్నికలు ముగిశాక.. వారి అవసరం తీరాక తమను పక్కన పెడతారా? అనే అనుమానం కూడా వారిలో లేకపోలేదు. దీంతో వారు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

హైవేకు భూములివ్వం



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

- తేల్చిచెప్పిన రైతులు
- పొలాల్లో హద్దు రాళ్ల ఏర్పాటుపై నిలదీత
- గందరగోళంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం
- కలెక్టర్‌కు నివేదిస్తామన్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: ఎన్‌హెచ్ 167(ఎన్) విస్తరణ పనులకు తమ భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా మా పొలాల్లో హద్దులు రాళ్లు ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను నిలదీశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్‌హెచ్ 167(ఎన్) రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఆర్డీఓ శ్రీనివాస్‌రావు సమక్షంలో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. అభివృద్ధి పేరిట ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పొట్ట కొట్టొద్దని అన్నారు. ప్రభుత్వం భూములు విక్రయిస్తే ఎకరాకు కోట్ల రూపాయలు వస్తాయని, అదే రైతుల నుంచి తీసుకుంటే లక్షల్లో మాత్రమే పరిహారం చెల్లిస్తారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు.

రైతులకు న్యాయం చేస్తాం: ఆర్డీఓ

రోడ్డు విస్తరణ పనుల కారణంగా భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎన్‌హెచ్ 167(ఎన్) కోసం 258 మంది రైతులకు సంబంధించి 67 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే ప్రజాభిప్రాయం సేకరించడానికి వచ్చినట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, హైవే అధికారి రమేష్‌రెడ్డి, ఆర్‌ఐ రాజిరెడ్డి పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

‘అవెన్యూ’కు ప్రాధాన్యమివ్వండి



పరిగిలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంపై ఆగ్రహం

పరిగి: మున్సిపల్ పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు లక్ష్మీనగర్‌లో ఈ నెల 26న మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. గురువారం మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను సంబంధిత అధికారులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలన్నారు. మున్సిపల్ పరిధిలో కేటాయించిన లక్ష్యం మేరకు ఐదు వేల మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పెద్ద సైజు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మొక్క నిటారుగా పెరిగేందుకు కర్రను ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు రెండు రోజుల సమయం మాత్రమే ఉందని, త్వరితగతిన గుంతలు తీసే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని సాలెపూలబాట తండాలో 10 ఎకరాల అటవీ భూమి ఉందని, అందులో 30 వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఆకర్షణీయంగా పెద్ద సైజు మొక్కలను నాటాలని ఆదేశించారు. తొమ్మిదేళ్లుగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు లేకపోవడంతో కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి మొక్కల సంరక్షణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, కౌన్సిలర్లు కృష్ణ, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పగడ్బందీగా నిర్వహించాలి

పూడూరు: సామూహిక హరితోత్సవ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హరితహారం మొక్కలు నాటేందుకు మండలంలోని జాతీయ రహదారికి ఇరువైపులా గుంతలు తవ్వే పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్, మండల ప్రత్యేక అధికారి సుధారాణి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అనంతగిరి: హరితహారం, మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై తీవ్ర చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. గురువారం ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఓలతో మెగా ప్లాంటేషన్‌పై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ నుంచే పోటీ చేస్తా

- ఇక్కడి ప్రజలే నాకు ప్రాణం.. ఊపిరి
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని పిలుపు



పెద్దేముల్: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కొడంగల్: ‘‘కొడంగల్ నియోజకవర్గం నాకు రాజకీయ భవిష్యత్తును ప్రసాదించింది. ఇక్కడి నుంచి పోటీ చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా. ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులతో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టా. నా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు కొడంగల్‌ను మరువను.. విడువను.. ఇక్కడి ప్రజలే నాకు ప్రాణం.. ఊపిరి.. పెద్దలు గురునాథ్‌రెడ్డి ఆశీస్సులతో ఇక్కడి నుంచే పోటీ చేస్తా’’ నని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భావోద్వేగంగా ప్రకటించారు. గురువారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ కుటుంబ సభ్యులు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఉమ్మడిరాష్ట్రంలో గురునాథ్‌రెడ్డి రాజకీయ భీష్ముడని కొనియాడారు. ఆయన కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో మా బలం పెరిగిందన్నారు. ఆయన గౌరవానికి భంగం కలగకుండా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని 8 మండలాలను కలిపి కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు 4వేల రూపాయల పింఛను ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిని కొడంగల్ నుంచి గెలిపించి సీఎంను చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

కేసీఆర్ అవినీతి పాలనను అంతం చేయాలి

పెద్దేముల్: రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్ అవినీతి పాలనను అంతం చేయాలని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామ శివారులోని జీపీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఓ ఒక్క హామీ సక్రమంగా అమలు కాలేదన్నారు. తాండూరులో ఇప్పటి వరకు జట్టు పట్టుకున్న బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ భయంతో ఇప్పుడు ఒక్కటయ్యారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, పార్టీ ప్రధాన కార్యదర్శి దారాసింగ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీహరి, మండల అధ్యక్షుడు గోపాల్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను జయప్రదం చేయండి

పూడూరు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే నీళ్ల, నిధులు, నియామకాలు దక్కుతాయని భావించిన తెలంగాణ ప్రజలకు నిరాశే ఎదురైందని, కేసీఆర్ కుటుంబానికే మాత్రమే లబ్ధి చేకూరిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ నెల 26న చేవెళ్లలో నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభకు సంబంధించి మండలంలోని మన్నెగుడ జేకే ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ప్రకటించిన 115 అసెంబ్లీ స్థానాల్లో ముదిరాజులకు ఒక్క సీటు దక్కకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ముదిరాజులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనంతరం పరిగి నియోజకవర్గానికి చెందిన పలువురు బీఎంఆర్ నేతలు డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పెంటయ్య, అజీం పటేల్, రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వరుణదేవా.. కరుణించవా..

- నెల రోజులకు పైగా కనిపించని వాన జాడ
- సీజన్ ప్రారంభంలో అధిక వర్షాలు
- నష్టపోయిన రైతులు
- లోటు వర్షంతో ఎండి పోతున్న పంటలు

వికారాబాద్ అర్బన్: ఈ ఏడాది వర్షాకాలం అన్నదాతను అయోమయంలో పడేస్తోంది. పంటలకు నీటి అవసరం ఉన్న సమయంలో వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. అవసరం లేని సమయంలో అధికంగా కురిసి అన్నదాతను నష్ట పరుస్తున్నాడు. మూడు ఏళ్ల తరువాత ఈ ఏడాది భిన్నమైన పరిస్థితిలో వర్షం పడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ప్రస్తుత సీజన్ ప్రారంభంలో కాలం కాస్త వెనుకబడినట్లు అనిపించినా, జూలై రెండో వారంలో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని రైతులకు నష్టం మిగిల్చింది. ఐదు రోజుల పాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు నిండి వాగులు పొంగి పొర్లాయి. అధిక వర్షాలతో జిల్లాలోని పలు మండలాల్లో పంట పొలాలు నీటి మునిగాయి. జూలై 25, 26, 27 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదైంది.

ఆగస్టులో లోటు వర్షపాతం

ఆగస్టు మాసంలో జిల్లాలో 177 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 13 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. జూన్, జూలై మొదటి వారాల్లో వేసిన పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము వంటి పంటలకు ఆగస్టు నెలలో వర్షం ఎంతో అవసరం. కానీ ఆగస్టు నెలలో మరో ఐదు రోజుల్లో దాటి పోతున్నా లోటు వర్షపాతం వెంటాడుతోంది. దీంతో జిల్లాలోని 20 మండలాల్లో పంట నష్టం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉన్నా, పంటలకు పారించే పరిస్థితి లేదు. జిల్లా వ్యాప్తంగా జూన్, జూలై మాసాల్లో 271.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు కావాలి. జూలై రెండో వారంలో కురిసిన భారీ వర్షాలకు ఏకంగా 529. 5 మి.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. అంటే జిల్లాలో జూలై 28వ తేదీ నాటికే 258.1 మి.మీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో సంవత్సరానికి 799.8 సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, జూలై నెలలోనే 529.5 వర్షపాతం నమోదైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్న ఆగస్టు మాసం మొత్తం వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండుముఖం పడుతున్నారు.

రైతులకు తప్పని నష్టం

నెల రోజుల క్రితం జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం లోటు వర్షపాతం నమోదు అవుతుండడంతో మరోమారు నష్టలు తప్పవని అన్నదాతలు వాపోతున్నారు.



ఎండు ముఖం పట్టిన మొక్కజొన్న పంట

పంట ఎండిపోతోంది



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశా. జూలైలో కురిసన వర్షాలకు పంట చాలా బాగుంది. కానీ నెల రోజులుగా వర్షం జాడ లేక పోవడంతో పంట ఎండి పోతోంది. మరో వారం రోజుల్లో చిన్నపాటి వర్షం రాకపోతే పూర్తిస్థాయిలో నష్టపోవాల్సి ఉంటుంది.

– వెంకటయ్య, రైతు, మమదాన్‌పల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం అదుకోవాలి. మరో వారం రోజుల పాటు వర్షాలు పడితే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

– కిష్టయ్య, రైతు, పీరంపల్లి

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



స్కూల్‌బస్ డ్రైవర్ ధ్రువపత్రాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

పరిగి: ప్రతి పాఠశాల బస్సు అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని నంబర్–1 గ్రౌండ్‌లో ప్రైవేటు స్కూల్ బస్సులను రవాణశాఖ అధికారులతో కలసి ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. స్కూల్ బస్సు నడిపే డ్రైవర్ విధిగా లెసెన్స్ కలిగిఉండి ఎప్పటికప్పుడు బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి అన్ని రకాల ధృవపత్రాలు కలిగిఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ జోసెఫ్, సీఐ వెంకటరామయ్య, ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పెద్దేముల్: విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు మృతిచెందగా కాపరికి తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన పెద్దేముల్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామానికి చెందిన రైతు బోయిని అంతప్ప పెద్దవాగు నుంచి అక్రమ విద్యుత్ కనెక్షన్‌తో గురువారం మోటార్‌తో పత్తి, పసుపు పంటకు నీరు పెడుతున్నాడు. మోటర్‌కు వాడిన విద్యుత్ తీగకు జాయింట్లు ఉండటం ఎవరూ గమనించలేదు. అదే గ్రామానికి చెందిన జనగాం నరేష్ తన ఎద్దులను పెద్ద వాగులో నీరు తాపడానికి వెళ్లాడు. అక్కడ మోటార్‌కు వేసిన కరెంటు వైర్ తగిలి ఎద్దు వాగులో పడి చనిపోయింది. ఎద్దు పక్కనే ఉన్న నరేష్‌కు ఎర్తింగ్ తగలడంతో వెంటనే వదిలించుకున్నాడు. ఈ విషయమై బాధితుడు నరేష్ పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కిందపడి వ్యక్తి మృతి

తాండూరు రూరల్: తాండూర్ మండలం నారాయణపూర్‌లో గురువారం ఓ వ్యక్తి మృతి చెందాడు. కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపూర్ గ్రామానికి చెందిన కర్నే భీమప్ప(64) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా కాలుజారి కింపడ్డాడు. భీమప్పకు గాయాలు కావడంతో వెంటనే తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. భీమప్ప మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదులో కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రాము

అనంతగిరి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ డిప్యూటీ లీగల్ డిఫెన్స్ అధికారి రాము అన్నారు. గురువారం వికారాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో మహిళా చట్టాలు, ర్యాగింగ్‌ను అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమ్మాయిల రక్షణకు కఠిన చట్టాలున్నాయని.. ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ అనిత, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిండుతూనే ఖాళీ!



అలుగు మధ్యలో పడిన రంధ్రం ద్వారా నిరంతరం బయటకు పోతున్న నీరు

ఓ వైపు నిండుతూనే మరో వైపు నుంచి ఖాళీ అవుతోంది ఎబ్బనూరు చెరువు. దీని ద్వారా ధారూరు, ఎబ్బనూర్, హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందేది. ప్రస్తుతం వంద ఎకరాలు కూడా పారడం లేదు. లీకేజీల కారణంగా చెరువులోని నీరంతా వృథాగా పోతోంది. చెరువును చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించినప్పటికీ పనులు సరిగ్గా చేయలేదు. ప్రస్తుతం అలుగు కింది భాగం, తూముల పక్క నుంచి నీరంతా వృథాగా పారుతోంది.

– ధారూరు



అలుగు కింది భాగంలో లీకేజీ కారణంగా వృథాగా పారుతున్న చెరువు నీరు

మోసపూరిత హామీలు నమ్మకండి

- బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి మోసపోవద్దు
- 'గృహలక్ష్మి'కి మూడు రోజులు, వైన్స్‌లకు పక్షం రోజుల గడువా?
- కర్ణాటక బల్లారి ఎమ్మెల్సీ సతీష్ యోచరెడ్డి



పెద్దేముల్: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బల్లారి ఎమ్మెల్సీ సతీష్ యోచరెడ్డి

పెద్దేముల్: బీఆర్‌ఎస్ పార్టీ మోస పూరిత హామీలు నమ్మి మరోసారి మోసపోవద్దని కర్ణాటక రాష్ట్రం బల్లారి ఎమ్మెల్సీ సతీష్ యోచరెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి?, మూడు ఎకరాల భూమి ఎంత మందికి వచ్చింది? సంక్షేమ పథకాలు ఎన్ని ఇచ్చారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం మాయ మాటలు చెప్పి మోసం చేస్తుందని ఆరోపించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మార్పును ప్రజలు కోరుకుంటున్నారని, కార్యకర్తలు, నాయకులు బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు.

మద్యం వ్యాపారంపైనే మక్కువ!

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల కంటే మద్యం వ్యాపారం పైనే మక్కువ ఎక్కువగా ఉన్నట్టుందని ఎమ్మెల్సీ సతీష్ విమర్శించారు. ఇందుకు ఉదాహరణ గృహలక్ష్మి పథకమేనన్నారు. స్కీం అర్జీకి మూడు రోజుల గడువు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం.. వైన్స్‌లకు మాత్రం 15 రోజుల గడువు ఇచ్చిన విషయమే చెబుతుంది ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అని ఎద్దేవా చేశారు. పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మోస పూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందని, ఇప్పుడు ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల కోసం మోసపూరిత మాటలు చెబుతూ అధికారంలోకి రావడానికి తహతహలాడుతున్నాయని, ఆ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

కుల వృత్తుల పేరుతో మోసం

దళితబంధు, కుల వృత్తుల పేరుతో అమాయక ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రజిని, మండల అధ్యక్షుడు సందీప్, నాయకులు బంట్వారం బద్రేశ్వర్, పూజారి పాండు తదితరులు పాల్గొన్నారు.

కమలమే ప్రధానం: హడగాలి ఎమ్మెల్యే కృష్ణ నాయక్

కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్రంలో మాటల గారడీతో అవినీతిపాలన కొనసాగుతుందని, వారి నియంతృత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని కర్ణాటక రాష్ట్రం హడగాలి ఎమ్మెల్యే కృష్ణ నాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీని గెలిపించుకునేందుకు కార్యకర్తలు మన ఇంటి నుంచే ప్రచారాన్ని ప్రారంభించి ఓటర్లను ఆకట్టుకోవాలని, అందుకు రానున్న వంద రోజులు అత్యంత కీలకమన్నారు. అభ్యర్థులు కాదు.. కమలమే ప్రధానమని, బూత్ స్థాయి నుంచి ప్రజల్లోకి వెళ్లగలిగితే పార్టీని అవలీలగా గెలిపించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు



కుల్కచర్ల: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ నాయక్

మల్లేశ్ పటేల్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, సర్పంచ్‌లు సౌమ్యారెడ్డి, విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, జిల్లా నాయకులు మిట్టాపరమేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు ఉన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

కుందపూర్ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

దౌల్తాబాద్: తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని కర్నాటక రాష్ట్రం కుందాపూర్ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ ప్రవాస్‌యోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలు బాగా పనిచేస్తే 70శాతం ఓట్లు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, మరోసారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఆయనను ప్రధాని చేయడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నర్సింహులు, బంటు రమేష్, కూర వెంకటయ్య, పున్నం చంద్‌లాహోటీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలల్లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల నిర్వహణకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడంగల్ పట్టణంలోని నంబర్–1 దుకాణానికి (బీసీ.బి మహిళ), నంబర్–2 దుకాణానికి (జనరల్), నంబర్–29 దుకాణానికి (బీసీ–సీ), మండలంలోని కస్తూర్‌పల్లి చౌకధరల దుకాణనికి (జనరల్–మహిళ), హస్నాబాద్ దుకాణానికి (జనరల్), బొంరాస్‌పేట మండలంలోని చౌదర్‌పల్లి దుకాణానికి (ఎస్సీ–మహిళ), నాందార్‌పూర్ (జనరల్), అల్లీఖాన్‌పల్లి (బీసీ–ఏ, మహిళ), మహంతీపూర్ (పీహెచ్‌సీ–మహిళ), దుద్యాల మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి (జనరల్), దౌల్తాబాద్ మండలంలోని గుండాల్ (ఎస్సీ), యాంకి (ఎస్టీ, మహిళ), దౌల్తాబాద్ (ఈడబ్ల్యూస్, జనరల్) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చౌకధరల దుకాణానికి సంబంధించి రిజర్వు చేయబడిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత పొందినవారు, ఆపై చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చని.. వచ్చిన దరఖాస్తులలో 10వ తరగతి అభ్యర్థులు లభించని పక్షంలో 7వ తరగతి వారిని కూడా నియమించేందుకు అవకాశం ఉందని, 18ఏళ్ల నిండి 40ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సంబంధిత గ్రామ పంచాయతీ, మండల కార్యాలయాల నోటీసు బోర్డులపై చూసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి ధృవపత్రం, కుల, నివాస, ఆధార్‌కార్డు, దరఖాస్తుదారు ఫోన్‌నెంబర్‌తో నింపిన దరఖాస్తులను తాండూర్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్ణీత గడువులోపు అందజేయాలని తెలిపారు.

అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత



గుంతలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: రేపు చేపట్టే మెగా ప్లాంటేషన్‌ను పటిష్టంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని కొత్తగడి, ధన్నారంతో పాటు మున్సిపల్ పరిధిలో గల బృంగి పాఠశాల వద్ద మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించి మాట్లాడారు. ప్లాంటేషన్‌లో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, పెద్ద సైజు మొక్కలు నాటి, వాటిని సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వందశాంతం కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ (మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్) శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ చోరీ

పెద్దేముల్: వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ దొంగతనం చేశారు. ఈ సంఘటన పెద్దేముల్ మండలం ఇందూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందూరు గ్రామానికి చెందిన పుష్పమ్మ అనే రైతు తన పొలంలో సొంత డబ్బులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ట్రాన్సఫార్మర్ కరెంటు సరఫరాను నిలిపివేసి, చమురు దొంగతనం చేశారు. గురువారం ఉదయం రైతు కరెంటు మోటార్‌ను ఆన్ చేయడానికి వెళ్లగా మోటార్ స్టాట్ కాలేదు. కరెంటు లేదని కొంత సేపు వేచి చూశారు. గ్రామంలో కరెంటు ఉందని గమనించి మళ్లీ మోటార్ స్టాటర్‌ను ఆన్ చేయగా అది పనిచేయలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా.. ఆయిల్ చోరీ అయినట్లు గుర్తించారు. వెంటనే విద్యుత్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి సంఘటన జరగటం ఇది రెండోసారి అని రైతులు తెలిపారు.



ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచే ఆయిల్ దొంగిలించిన దుండగులు

26న జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక

షాబాద్: జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు శనివారం క్రీడాకారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి ఎస్‌జీఎం(స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) క్రీడల్లో భాగంగా శనివారం శంకర్‌పల్లి జోన్ క్రికెట్ సెలక్షన్స్‌ను షాబాద్ పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగంలో కేజీబీవీ, మోడల్ స్కూల్స్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించిన్నట్లు తెలిపారు. చేవెళ్ల, శంకర్‌పల్లి విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, క్రీడా పరికరాలతో పాల్గొనాలన్నారు.

మేకగూడలో పశువైద్యాధికారుల బృందం

- స్థానిక పరిశ్రమలపై ఫిర్యాదు నేపథ్యంలో విచారణ

నందిగామ: మండల పరిధిలోని మేకగూడలో పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంతో పంటలు దెబ్బతిన డంతో పాటు పశువులు మృత్యువాత పడుతున్నాయని గతంలో కొంతమంది గ్రామస్తులు హైకోర్టులో పిటిషన్ వేశారు. కాగా హైకోర్టు ఆదేశాలతో జిల్లా పశువైద్యాధికారుల బృందం గురువారం మేకగూడలో విచారణ చేపట్టారు. గ్రామశివారులోని ప్రైవేట్ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో ఇబ్బందులకు గురవుతున్నామని 56 మంది రైతులు, గ్రామస్తులు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అంజిలప్ప, డాక్టర్ విజయ్ కుమార్, మండల పశువైద్యాధికారి డాక్టర్ విష్ణువర్ధన్‌కు వివరించారు. అధికారుల బృందం స్థానికంగా పరిశీలన చేసి వివరాలను సేకరించారు. కాగా పిటిషన్లు వేసిన వారిలో మేకగూడ గ్రామానికి చెందినవారే కాకుండా కొంతమంది స్థానికేతరులు కూడా ఉన్నారని గ్రామస్తులు ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను ఇబ్బందులకు గురిచేయాలని ఇలాంటి పిటిషన్లు వేసినట్లు వారు ఆరోపించారు. అయితే విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వైద్యబృందం తెలిపింది.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

బీఆర్‌ఎస్‌కు పలువురు గుడ్ బై

- కాంగ్రెస్ గూటికి ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రేవంత్



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్



రేవంత్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పార్టీ ఫిరాయింపుల పరంపర కొనసాగుతోంది. ఈ పార్టీ నుంచి ఆ పార్టీకి.. ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి అంటూ నాయకులు వలస బాటపట్టగా.. అనుచరులు సైతం వారి బాటలోనే పయనిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రేవంత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యుల గౌరవాన్ని కాపాడతానని రేవంత్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి రేవంత్, గురునాథ్ రెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వందలాది మంది కార్యకర్తలు నాయకులు రేవంత్‌కు బాసటగా నిలిచారు. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, డీఏస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, మురహరి వశిష్ఠ, కృష్ణంరాజు, నయీం, దాము పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను ఆదుకోండి

పెద్దేముల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కందనెల్లిలోని ఓ గార్డెన్‌లో జరుగుతున్న కార్యకర్తల సమావేశంలో ఉన్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సెకండ్ ఏఎన్‌ఎంలు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు ఏఎన్‌ఎంలు మాట్లాడారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించడం లేదని పేర్కొన్నారు. ఖాళీల భర్తీకోసం ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఏఎన్‌ఎంలను కాంగ్రెస్ ఆదుకుంటే పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. ఇందుకు రేవంత్ స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, కోశాధికారి భారతి, ప్రధాన కార్యదర్శి మల్లమ్మ, సహాయ కార్యదర్శి పుష్ప, వెంకటమ్మ, కమిటి సభ్యులు సుజాత, రేణుక, జగదీశ్వరి, నర్సమ్మ, కవిత, నర్మద, కరుణ, కమల, అనురాధ, సైదమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లో వ్యక్తి ఆత్మహత్య

పెద్దేముల్: ఫాంహౌస్‌లో చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దేముల్ పీఎస్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలపిన వివరాలు.. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామ సమీపంలోని కిరణ్‌కుమార్ ఫాంహౌస్‌లో కామారెడ్డి జిల్లా మద్దూర్ గ్రామానికి చెందిన రఘునాథ్(59) కొంతకాలంగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం రఘునాథ్ యథావిధిగా ఫాంహౌస్‌కు పనికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు తిరిగిరాకపోవడంతో మన్‌సాన్‌పల్లి తండాకు చెందిన గంగారాంతో పాటు అక్కడే పనిచేస్తున్న రాములు కలసి వెతకగా ఫాంహౌస్‌లోని వేపచెట్టుకు ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ట్రస్మా' కన్వీనర్‌గా బీరప్ప

మీర్‌పేట: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) రంగారెడ్డి జిల్లా మెంబర్‌షిప్ కన్వీనర్‌గా మీర్‌పేట కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప, కోకన్వీనర్‌గా బోళ్ల శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను ఒకే తాటి పైకి తీసుకురావడంతో పాటు ప్రైవేటు పాఠశాలల సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

ప్రతి మొక్కను సంరక్షించుకోవాలి

మర్పల్లి: భారత వజ్రోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న నాటే ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని మండల ప్రత్యేక అధికారి (డీఎల్‌పీఓ) అనిత పంచాయతీ కార్యదర్శులు, ఉపాధీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మర్పల్లి మండలం సిరిపురం, కొత్లాపూర్, మర్పల్లి, దామస్తాపూర్, శాపూర్, పెద్దాపూర్, రావులపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో రోడ్ల పక్కన నాటే మొక్కలను ఆమె తనఖీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం గ్రామాల్లో మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఇంత వరకు ఏ గ్రామంలో ఎన్ని గుంతలు తీశారు, ఎన్ని మొక్కలను సరఫరా చేశారనే వివరాలను ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, ఏపీఓ అంజిరెడ్డిలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మహేశ్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి అనిత

బాలికపై లైంగికదాడి..

- పరారీలో నిందితుడు
- ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ వ్యక్తి బాలికను నమ్మించి నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుఝామున చోటుచేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలానికి చెందిన బాలిక (16) గత యేడాది నుంచి తుర్కయంజాల్‌లోని తన అక్క వద్ద ఉంటుంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌లో బాలిక ఇంటి చుట్టువద్ద నివాసం ఉండే నరేష్ తుర్కయంజాల్‌కు వచ్చాడు. అక్క ఇంట్లో నిద్రిస్తున్న బాలికకు ఫోన్‌చేసి ఇంట్లో నుంచి బయటకు రప్పించాడు. బుధవారం తెల్లవారుఝామున నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేసి బాలికను వదిలేసి పరారయ్యాడు. తెల్లవారేసరికి బాలిక కోసం అక్క ఇంట్లో వెతకగా కనిపించలేదు. పైన టెర్రస్‌లో పడుకొని ఉంది. ఇక్కడ ఎందుకు పడుకున్నావని అక్క ఆరాదీయగా ఏమీ చెప్పలేదు. గురువారం తల్లిదండ్రులను మహబూబ్‌నగర్ నుంచి రప్పించి మందలించడంతో అత్యాచార విషయాన్ని చెప్పి భోరున విలపించింది. ఈ మేరకు ఆదిబట్ల పీఎస్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నరేష్ ఆచూకీ కోసం వెతుకుతున్నారు.